అంబేడ్కర్ జోలికి వస్తే సహించేది లేదు

- జేఏసీ సభ్యుల నిరసన
- రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మ దహనం

తెనాలి రూరల్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్అంబేడ్కర్ ఫ్లెక్సీని ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజు చించడాన్ని నిరసిస్తూ తెనాలిలో జేఏసీ సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక గాంధీ చౌక్‌లో ఆయన దిష్టిబొమ్మను ఆదివారం రాత్రి దహనం చేశారు. అంబేడ్కర్ జోలికి వస్తే సహించేది లేదని, రఘురామ కృష్ణంరాజు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు కనపర్తి అనిల్, బొనిగల ప్రదీప్, కారుమంచి సునీల్, గడ్డేటి సుందరరావు, అక్కిదాసు కిరణ్ కుమార్, కంచర్ల కోటేశ్వరరావు, కంచర్ల శ్రీను, బండికళ్ల బుల్లయ్య, మంచాల సందీప్, జమ్మి సతీష్‌బాబు పాల్గొన్నారు.


రఘురామ కృష్ణంరాజు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జేఏసీ సభ్యులు

రఘురామరాజుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

తెనాలి డీఎస్పీకి ఫిర్యాదు చేసిన ఎస్సీ నేతలు

తెనాలి: రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించిన ఉండి ఎమ్మెల్యే రఘురామ కృష్ణంరాజుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదుచేయాలని పలువురు ఎస్సీ నాయకులు ఆదివారం తెనాలి డీఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. రఘురామ కృష్ణంరాజు అంబేడ్కర్ ఫ్లెక్సీని తొలగించడం క్షమించరాని నేరమని తెలిపారు. మొదటి నుంచి ఆయన దళితులపై అక్కసు వెళ్లగక్కుతున్నారని, దేశం మొత్తం గౌరవించే అంబేడ్కర్‌ను అవమానించడం దారుణమని ఖండించారు. రఘురామపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేయాలని కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా ఆయన్ను వెంటనే టీడీపీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం చూపుతానని రాగద్వేషాలకు పోను అని, ప్రజలతో శాంతి సమాధానాలతో ఉంటానని రాజ్యాంగం మీద ప్రమాణం శాసనసభ్యుడే ఇలాంటి రెచ్చగొట్టే పనులు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు. కార్యక్రమంలో తెనాలి బీఎస్పీ నేత కారుమంచి సునీల్ సందీప్, బొనిగల ప్రదీప్, మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు గడ్డేటి సుందర్ సునీల్ కుమార్, గాలి వెంకట్, పిల్లి తిమోతి, బొడ్డు డేవిడ్, అరిగ ప్రసాద్, పిల్లి దాసు, పిల్లి రాజేష్, సముద్రాల కన్నా, వంపుగళ్ల సురేష్, గోవతోటి మనోజ్, వాసుమల్ల వేణు పాల్గొన్నారు.


డీఎస్పీ జనార్దనరావుకు ఫిర్యాదు అందజేస్తున్న నాయకులు

రేపు కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతి

తెనాలి: భారతీయ తత్వశాస్త్రంలో విశేష కృషి చేసిన తెనాలికి చెందిన సుప్రసిద్ధ తత్వశాస్త్రవేత్త పద్మ విభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి శతజయంతిని ఈనెల 24వ తేదీన నిర్వహించనున్నారు. పట్టణానికి చెందిన వివేక ఎడ్యుకేషనల్ సొసైటీ, తెనాలి ఇంప్రెషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుక ఆహ్వాన పత్రికను ఆదివారం సాయంత్రం వివేక విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ కె.రామరాజు ఆవిష్కరించారు. అనంతరం వివరాలను తెలియజేశారు. ఆరోజు ఉదయం 10.30 గంటలకు బుర్రిపాలెంరోడ్డులోని శ్రీవివేకానంద సెంట్రల్ స్కూల్ ఆవరణలోని థియేటరులో జరిగే శతజయంతి సభకు డాక్టర్ రావిపాటి వీరనారాయణరావు అధ్యక్షత వహిస్తారు. తెనాలి ఇంప్రెషన్స్ రూపొందించిన 'పద్మవిభూషణ్ కొత్త సచ్చిదానందమూర్తి' పుస్తకాన్ని కవి, రచయిత, రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ విశ్రాంత సంచాలకుడు వాడ్రేవు చినవీరభద్రుడు ఆవిష్కరిస్తారు. దళిత సార్వత్రిక విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, ప్రజాసాహితి మాసపత్రిక ప్రధాన సంపాదకులు కొత్తపల్లి రవిబాబు విశిష్ట అతిథులుగా హాజరవుతారని తెలిపారు. తత్వశాస్త్రాన్ని సామాన్యులకు అర్థమయేలా కృషిచేసిన సచ్చిదానందమూర్తి, భారత నాగరికత, చరిత్ర, సాంఘిక అంశాలతో పాటు హిందూ ధర్మ శాస్త్రాలు, మెటాఫిజిక్స్, ఆఫ్రో ఏషియన్ ఫిలాసఫీలపై ఇంగ్లిష్‌లో 30పైగా, తెలుగులో 12కు పైగా అత్యంత ప్రాముఖ్యత కలిగిన గ్రంథాలను రచించినట్టు వీరనారాయణరావు తెలిపారు. ఆంధ్రా యూనివర్సిటీ ప్రొఫెసర్‌గా, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్‌గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా వ్యవహరించినట్టు వివరించారు. కార్యక్రమంలో మురళి, కె.రిషిత, పి.మోనాలి పాల్గొన్నారు.


ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న వీరనారాయణ, రామరాజు

ఉచిత కంటి వైద్య శిబిరంలో 150 మందికి పరీక్షలు

తెనాలి రూరల్: పట్టణ మారిస్‌పేటలోని రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత కంటి వైద్యశిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ కాపరి బిషప్ పినపాటి జాన్‌పాల్ సహకారంతో గంగానమ్మపేటకు చెందిన శ్రీలక్ష్మి విజన్‌కేర్ సెంటర్ వైద్యులు శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 150 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 50 మందికి కళ్లజోళ్లు, 100 మందికి మందులను ఉచితంగా అందజేశారు. త్వరలో 10 మందికి కంటి శుక్లాల శస్త్ర చికిత్సలను ఉచితంగా చేయనున్నట్టు విజన్ కేర్ సెంటర్ నిర్వాహకుడు డాక్టర్ భాస్కరరావు తెలిపారు. తమ వైద్యశాల ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా రాక్ గాస్పెల్ చర్చిలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమాన్ని చర్చి సంఘ పెద్దలు పినపాటి డేవిడ్ రాజు, ఈవూరి శ్రీనివాసరావు, కసుకుర్తి భాస్కరరావు, జైరాజు, ఈవూరి ఏసురత్నం, పినపాటి ఫ్రాన్సిస్, కొలవరపు ఏసుదాస్ పర్యవేక్షించారు.


పరీక్షలు చేస్తున్న డాక్టర్ భాస్కరరావు

ప్రగతి పథంలో కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ

సర్వసభ్య సమావేశంలో చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు

తెనాలి: కాకతీయ మ్యూచ్‌వల్లీ ఎయిడెడ్ థ్రిఫ్ట్ అండ్ క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, తెనాలి 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఏర్పాటైన సమావేశానికి సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత వహించారు. సొసైటీ సీఈవో కనమర్లపూడి ఝాన్సీలక్ష్మి వార్షిక నివేదికను సమర్పించారు. సభ్యులు, ప్రజల సహకారం, ఆదరణతో సొసైటీ పురోగమిస్తోందని లక్ష్మీకాంతారావు వెల్లడించారు. సొసైటీ తరపున సిక్త్ సిగ్మా చెస్ అకాడమీ ఛాంపియన్‌షిప్‌లో విజేతలైన చిన్నారులకు నగదు బహుమతులు, పేద విద్యార్థులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్లు, సభ్యులు చైర్మన్ లక్ష్మీకాంతారావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు వేదాంతం సుబ్రహ్మణ్యశాస్త్రి, షేక్ ఖలీల్, దావులూరి చక్రధర చౌదరి పాల్గొన్నారు. తొలుత సాంస్కృతిక కార్యక్రమాల్ని ప్రదర్శించారు.


లక్ష్మీకాంతారావును సత్కరిస్తున్న డైరెక్టర్లు

స్కాట్ టీం ఏర్పాటుకు ఆర్థిక సాయం

అన్నవరపులంక(కొల్లిపర): అన్నవరపులంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కౌట్ టీం ఏర్పాటుకు బెంగుళూరుకు చెందిన సుజన సేవా సమితి రూ. 10వేలు ఆర్థికసాయం చేసింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.మల్లేశ్వరరావు, స్కౌట్ మాస్టర్ జి.కిరణ్ మాట్లాడుతూ ఈ నగదుతో విద్యార్థులకు డ్రెస్, బ్యాడ్జీలు , ఇతర సామగ్రి కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా సుజన సేవా సమితి వారికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు పలు ప్రాంతాల్లో తాగునీరు సరఫరా నిలిపివేత

తెనాలి అర్బన్: రక్షిత మంచినీటి పైపులైను మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం పట్టణంలోని పినపాడు, ఉడాకాలనీ, చంద్రబాబునాయుడు కాలనీల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం యథావిధిగా జరుగుతుందని పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కొల్లిపర: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన ఆదివారం మధ్యాహ్నం కొల్లిపరలోని హోలీక్రాస్ పాఠశాల సమీపంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రెండు మోటార్ సైకిళ్లు పాఠశాల సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మండలంలోని పిడపర్తిపాలేనికి చెందిన కంచర్ల ఏసోబుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 ద్వారా తెనాలి ప్రభుత్వ వైద్య శాలకు తరలించారు. ప్రమాదంలో మరొక వ్యక్తి కొల్లిపర గ్రామానికి చెందిన యువకుడు. ఇతనికి స్వల్పంగా గాయాలయ్యాయి.

స్పృహ తప్పి పడిపోయిన వ్యక్తి

పోలీసులు వైద్యశాలకు పంపగా మృతి

తెనాలి రూరల్: రోడ్డుపై వ్యక్తి స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళుతున్న పోలీసు అధికారి చూసి కారు దిగి వచ్చి అతన్ని సిబ్బందితో వైద్యశాలకు పంపారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. తెనాలి బస్టాండ్ ప్రాంతంలో ఉండే విజయకుమార్(68) వంట పనులకు వెళుతుంటాడు. ఆదివారం మధ్యాహ్నం కొత్త వంతెనపై నడుచుకుంటూ వెళుతుండగా స్పృహ తప్పి పడిపోయాడు. అటుగా వెళుతున్న డీఎస్పీ బి. జనార్దనరావు చూసి వాహనం దిగి వచ్చి సిబ్బందితో తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయినా, పోలీసుల ప్రయత్నం ఫలించలేదు. వైద్యశాలలో అతను మృతి చెందాడు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పోలీసులు చెప్పారు.

సైబర్ నేరాలు, మోసాలపై అప్రమత్తత అవసరం

తెనాలి రూరల్: సైబర్ నేరాలు, మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు డీఎస్పీ బి.జనార్దనరావు ఆధ్వర్యంలో వారధి కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి స్థానిక ఫుడ్ గ్రెయిన్స్ అండ్ కిరాణా మర్చంట్ అసోసియేషన్ హాలులో పోలీసులు నిర్వహించారు. సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, ఓటీపీ, ఈకేవైసీ మోసాలు, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ వంటి వాటిపై వీడియో రూపంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు, టూ టౌన్ సీఐ నిస్సార్ బాషా, రూరల్ సీఐ బెల్లం శ్రీనివాసరావు, పలువురు వ్యాపారులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.


వారధిలో మాట్లాడుతున్న పోలీసులు

స్కాలర్‌షిప్పులు, కుట్టుమిషన్లు పంపిణీ

గుంటూరు మెడికల్: పట్నంబజారులోని సుష్మగౌడ్ ఫౌండేషన్ కార్యాలయంలో సంస్థ అధ్యక్షుడు జల్లెడ శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన ఇద్దరు మహిళలకు కుట్టు మిషన్లు, ప్రతిభా కనపరిచిన 11మంది విద్యార్థులకు రూ.1,10,000 స్కాలర్‌షిప్పులు పంపిణీ చేశారు. సుష్మ గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జల్లెడ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పేదలకు, విద్యార్థులకు సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ ఉపాధ్యక్షుడు నాగ వెంకట శివప్రసాద్ గౌడ్, ప్రధాన కోశాధికారి జల్లెడ జయసుస్మితారావు గౌడ్ , కార్యదర్శి జల్లెడ సుష్మా రావు గౌడ్ , సహ కార్యదర్శి హరిత గౌడ్ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు వాకా రాంగోపాల్ గౌడ్, గుంటూరు జిల్లా గౌడ్ సంఘ అధ్యక్షుడు తుళ్ళూరు శ్రీనివాసరావు, గీతా బంధు సేవా ట్రస్ట్ ఫౌండర్ చైర్మన్ వీరంకి రంగారావు, రాష్ట్ర గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి వేముల వెంకటాచలం, కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్టు ఫౌండర్ సెక్రటరీ బొబ్బిళ్ళ వెంకటేశ్వరరావు, చైర్మన్ పామర్తి సాంబశివరావు, గౌడ సేవా ట్రస్టు అధ్యక్షుడు దాసరి వెంకట్రావు. గౌడ సేవా ట్రస్టు ఉపాధ్యక్షుడు చెన్ను శ్రీనివాసా కుమార్. గుంటూరు అర్బన్ గౌడ సంఘం అధ్యక్షుడు రావుల మణి గౌడ్, డాక్టరు శౌంతి కిశోర్, తాతా కోటయ్య, వాకా మాధవ్, వాకా సాంబశివరావు పాల్గొన్నారు .


స్కాలర్‌షిప్పులు, కుట్టు మిషన్లు అందజేస్తున్న శ్రీనివాస్‌గౌడ్, శివప్రసాద్‌గౌడ్ తదితరులు

అబాకస్ సాధనతో విద్యార్థుల మేధకు పదును

గుంటూరు ఎడ్యుకేషన్: అబాకస్ సాధనతో విద్యార్థుల మేధకు పదును పెట్టవచ్చునని సిప్ అబాకస్ ఆంధ్రప్రదేశ్ డైరెక్టర్ గోపాలకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం అశోక్ నగర్‌లో సిప్ అబాకస్ ఇంటర్నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శాఖను ప్రారంభించారు. ఈసందర్భంగా నగరంలోని వివిధ ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఏడో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు కలరింగ్ పోటీలు నిర్వహించారు. అనంతరం గోపాలకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగున్న సృజనాత్మకత నైపుణ్యాలు వెలికితీసి, వారిలో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ధారణశక్తిని పెంపొందించడంలో అబాకస్ దోహదపడుతుందని అన్నారు. గణితంలో మంచి ప్రావీణ్యత సాధించేందుకు సులువైన పద్ధతుల్లో అబాకస్ అందిస్తున్నట్లు తెలిపారు. సిప్ అబాకస్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం ప్రపంచవ్యాప్తంగా 12 దేశాలతో పాటు భారతదేశంలోని 23 రాష్ట్రాల్లో 950 శాఖలతో ఐదువేల మంది ఉపాధ్యాయులతో అబాకస్ శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈసందర్భంగా కలరింగ్ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో గుంటూరు హెడ్ మిల్కీ, మల్లికార్జునరావు పాల్గొన్నారు.


కలరింగ్ కాంపిటీషన్‌కు హాజరైన విద్యార్థులు

జీజీహెచ్‌లో స్వచ్ఛత హి సేవ

గుంటూరు: జీజీహెచ్ నుంచి రోగి ఆరోగ్యంగా ఇంటికి వెళ్లాలంటే వైద్యంతో పాటు పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉండాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం జీజీహెచ్‌లో స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి గోడలకు రంగులు వేసి పరిశుభ్రం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ చేతులు కలపాలని కోరారు. పరిశుభ్రం చేసేందుకు వలంటీర్లు ముందుకురావాలని కోరారు. కార్యక్రమంలో మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ వడ్డాది వెంకట కిరణ్, అడ్మిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

రామచంద్రరావు సేవలు అభినందనీయం

తెనాలి అర్బన్: స్థానిక మున్సిపల్ కార్పొరేషన్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తూ రేపల్లెకు బదిలీ అయిన ఆకురాతి రామచంద్రరావు అభినందన సభను ఆదివారం మారీసుపేటలో ఫెంటాస్టిక్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు వారు మాట్లాడుతూ విధి నిర్వహణలో రామచంద్రరావు బాధ్యతతో వ్యవహరిస్తూ అధికారుల మన్ననలను పొందారని తెలిపారు. అనంతరం ఆయన్ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ గాజుల మోహన్, గోపాళం శ్రీనివాసరావు, గాజుల విజయసారథి, గాజుల శ్రీనివాస్, తోటకూర చిట్టిబాబు, విష్ణుమొలకల శ్యాం సుందర్, తాడికొండ చిన్నబ్బాయి పాల్గొన్నారు.


రామచంద్రరావును సన్మానిస్తున్న ఫెంటాస్టిక్ ఫ్రెండ్స్ సర్కిల్ ప్రతినిధులు.

విద్యార్థి పోరాటాల గొంతుక సీతారాం ఏచూరి

లక్ష్మీపురం: విద్యార్థి పోరాటాల గొంతుక సీతారాం ఏచూరి అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్ పేర్కొన్నారు. స్థానిక బ్రాడీపేటలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. తొలుత మాజీ ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కిరణ్ మాట్లాడుతూ విద్యార్థి దశలో యూనివర్సిటీ సమస్యల మీద మాజీ ప్రధాని ఇందిరా గాంధీ ఇంటి వద్ద ధర్నా చేసినట్లు గుర్తు చేశారు. ఎస్ఎఫ్ఐ చదువుతూ పోరాడు, చదువుకై పోరాడు అనే నినాదంతో ఎమర్జెన్సీని ఎదిరించి పోరాడిన సైనికుడు అని అన్నారు. విద్యార్థి నాయకత్వం నుంచి సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి వరకు ఎదగడంలో ఎస్ఎఫ్ఐలో చేసిన ఎన్నో పోరాటాలు మనకు ఆదర్శం అని విద్యార్థి దశ నుండే కాక ఎం.పీ గా ఉన్న సమయంలో విద్యార్థి సమస్యలను పార్లమెంట్లో ప్రస్తావిస్తూ నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకిస్తూ అనేక ప్రసంగాలు చేశారని గుర్తు చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతన జాతీయ విద్యా విధానం 20-20ని ప్రవేశ పెడుతూ విద్యని ప్రైవేటీకరణ, కాషాయీకరణ, కేంద్రీకరణ చేయాలని చూస్తుందని పార్లమెంట్లో ఆయన తన గొంతుకను వినిపించారని చెప్పారు. నూతన జాతీయ విద్యా విధానాన్ని వ్యతిరేకించటమే సీతారాం ఏచూరి కి నిజమైన నివాళి అని చెప్పారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్కే సమీర్, ఉపాధ్యక్షురాలు సుచరిత, సహాయ కార్యదర్శులు పవన్, యశ్వంత్, జిల్లా కమిటీ సభ్యులు అభి, షరీఫ్, జగదీష్, ఆరిఫా, ప్రతాప్, అజయ్ పాల్గొన్నారు.


సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

చిన్నారుల పెద్ద మనస్సు



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంటలోని అయ్యప్ప రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో చిన్నారులు దాతృత్వం చాటారు. విజయవాడ వరద బాధితుల సహాయార్థం తల్లిదండ్రుల నుంచి సేకరించిన రూ.21,534లను ఆదివారం తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే ఎండీ నసీర్ అహ్మద్‌కు ఆయన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో చలమయ్య డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, అయ్యప్ప రెసిడెన్సీ వాసులు నాగదర్, సుహాస్, శ్రీనిధి, పావని, రితిక, దాశరథి విఘ్నేశ్వర్, నిత్య, దినేష్, ఆర్యవైశ్య నాయకులు కొనకళ్ళ సత్యం, కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం ఉత్సవ కమిటీ కన్వీనర్ కోటా శేషగిరి పాల్గొన్నారు.

భావితరాలకు కర్ణాటక సంగీతం అందించడం లక్ష్యం

నగరంపాలెం: భావి తరాలకు సంప్రదాయ కర్ణాటక సంగీతాన్ని అందించడమే లక్ష్యమని శ్రీ త్యాగరాజ సాంస్కృతిక సంఘం కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్ అన్నారు. సంఘం ఆధ్వర్యంలో లక్ష్మీపురం శ్రీ త్యాగరాజ మందిరంలో ఆదివారం కర్ణాటక గాత్ర సంగీత పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్, జూనియర్స్, సీనియర్స్ హాజరై, తమ ప్రతిభను చాటారు. వచ్చే నెలలో రెండో విడత పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మొదటి బహుమతి రూ.3 వేలు, రెండో బహుమతి రూ.2 వేలు, మూడో బహుమతి వెయ్యి రూపాయలు అని తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వాగ్గేయకార ఉత్సవాల్లో బహుమతులను ప్రదానం చేస్తామని అన్నారు. న్యాయ నిర్ణేతలుగా సాయిశృతి మ్యూజిక్ అకాడమీ డైరెక్టర్ ప్రేమ కుమార్, శ్రీభారతి సంగీత నిలయం అధ్యక్షురాలు భారతిదేవి, సంగీత కళాశాల ఉపాధ్యాయులు బీరక సురేష్‌బాబు వ్యవహరించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు గిరిజా శంకర్, కార్యవర్గ సభ్యులు సరయు, రాజ్యలక్ష్మి, ఫణితేజ పాల్గొన్నారు.


గాత్ర సంగీత పోటీల్లో ఓ విద్యార్థిని..

క్లుప్తంగా

ప్రజ్ఞాచారికి జాతీయ సాహితీ సేవా పురస్కారం



తెనాలి రూరల్: మండలంలోని కొలకలూరుకు చెందిన సాహితీరత్న డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారి జాతీయ సాహితీ సేవా పురస్కారానికి ఎంపికయ్యారు. షిర్డీ సాయినాథుని 189వ జయంతిని పురస్కరించుకుని చిలకలూరిపేటకు చెందిన జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో సాయి మహానుభావా సాహితీ సేవ జాతీయ పురస్కారాన్ని అందించనున్నారు. దశాబ్దాల నుంచి సాహితీ సేవ చేస్తున్న పూర్ణ ప్రజ్ఞాచారిని జాతీయ పురస్కారానికి ఎంపిక చేసినట్టు ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ తెలిపారు. చిలకలూరిపేట శ్రీ సాయి టెక్నో స్కూల్ ఆవరణంలో ఈ నెల 28న పురస్కారం ప్రదానం చేయనున్నట్టు చెప్పారు.

వరద బాధితులకు నిత్యావసర వస్తువుల పంపిణీ



తెనాలి అర్బన్: వరదల వల్ల ఇబ్బందులు పడుతున్న భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామవాసులకు తెనాలికి చెందిన ఈరే మినిస్ట్రీస్, జైభీమ్ ఫెడరేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో దుప్పట్లు, దోమతెరలు, కూరగాయలు, నిత్యవసర వస్తువులను ఆదివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈరే మినిస్ట్రీస్ అధినేత బిషప్ సు.దీర్ కుమార్, జైభీమ్ ఫెడరేషన్ అధ్యక్షుడు కొలవరపు దేవానంద్ పాల్గొన్నారు.

ఇసుక అక్రమంగా తరలిస్తే చర్యలు



కొల్లిపర: ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. ఆయన శనివారం రాత్రి సిబ్బందితో కలసి మండలంలోని వల్లభాపురం, అత్తలూరిపాలెం గ్రామాల్లో గస్తీ నిర్వహించారు. ఈ సందర్భంగా అత్తలూరి గ్రామంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను గుర్తించారు. డ్రైవర్‌వద్ద ఎటువంటి పత్రాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదుచేసి, ట్రాక్టర్‌ను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

టెన్నిస్‌లో విద్యుత్ ఉద్యోగి ప్రతిభ



తెనాలి రూరల్: టెన్నిస్‌లో విద్యుత్ శాఖ ఉద్యోగి ప్రతిభ చూపారు. పట్టణానికి చెందిన కొమరవోలు మహేష్ విద్యుత్ శాఖలో పని చేస్తున్నారు. నెల్లూరులో ఇటీవల జరిగిన ఏపీసీపీడీసీఎల్ రాష్ట్రస్థాయి పోటీలలో సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో విజేతగా నిలిచారు. తెనాలి కొత్తపేటలోని అఫీషియల్స్ క్లబ్‌లో ఆయన టెన్నిస్ ప్రాక్టీస్ చేస్తుంటారు. రెండు విభాగాల్లో విజేతగా నిలవడంతో సహచర ఉద్యోగులు, క్రీడాకారులు అభినందించారు.

అల్జీమర్స్ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే సమస్యలు

లక్ష్మీపురం: అల్జీమర్స్ వ్యాధిని గుర్తించి ప్రారంభ దశలోనే చికిత్స చేయించుకుంటే మంచిదని, నిర్లక్ష్యం చేస్తే రోగికి, కుటుంబ సభ్యులకు చాలా ఇబ్బందులు ఎదురవుతాయని ప్రముఖ మానసిక వైద్యులు కోట సురేష్ అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఆదివారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో ఆరోగ్య సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 60 ఏళ్ల పై బడిన వారిలో ఎక్కువగా మతిమరుపు వస్తుందని, ఈ వ్యాధిని రాకుండా నిరోధించలేమని, అయితే అది రావడానికి తోడ్పడే కారణాలను త్వరగా గుర్తిస్తే ఎక్కువగా పెరగకుండా చూడవచ్చన్నారు. వయస్సు పెరిగే కొద్ది మెదడులో వచ్చే మార్పులు, కొన్ని చెడు ప్రొటీన్లు చేరడంతో నరాలు క్రమంగా క్షీణించి పోవడంతో ఈ అల్జీమర్స్ సమస్య ఎదురవుతుందని వివరించారు. అనంతరం డాక్టర్ సురేష్‌కుమార్ సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సంస్థ సభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ విశ్లేషకులు వి.వి.రావ్, డాక్టర్ రవీంద్రకుమార్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ సంగీత కచేరి

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురం త్యాగరాజ కళావేదికపై ఆదివారం సాయంత్రం శ్రీత్యాగరాజ సాంస్కృతిక సంఘం ఆధ్వర్యంలో నమతీర్థల సిస్టర్స్ యుగళ శాస్త్రీయ సంగీత కచేరి నిర్వహించారు. త్యాగరాజ కీర్తనలతో పాటు పలు వాగ్గేయకార కీర్తనలను ఆలపించారు. కచేరి సంగీతాభిమానులను అలరించింది. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై బీరక సురేష్ బాబు సహకారాన్ని అందించారు. కార్యక్రమంలో కార్యదర్శి వల్లూరి కృష్ణకిశోర్, ఉపాధ్యక్షులు ఎస్.గిరిజాశంకర్ పాల్గొన్నారు. చివరగా కళాకారులను సత్కరించారు.